www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబరు 2025

5

పశ్చిమ గోదావరి



యూరియా కొరత లేదు: డిసిఎంఎస్ చైర్మన్

ఏలూరు సిటీ : ఎక్కడా యూరియా కొరత లేదని, వైసిపి ప్రభుత్వం రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారంటూ అనడం హాస్యాస్పదంగా ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ అన్నారు. డిసిఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 396 టన్నుల యూరియా స్టాక్ ఉందని తెలిపారు. యూరియాతో పాటు కాంప్లెక్స్, పొటాష్ రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎప్పుడైనా రైతులకు ఇబ్బంది కలిగితే ట్రాన్స్‌పోర్ట్ వల్ల లేట్ అవ్వచ్చు కానీ యూరియా కొరత ఏమీ లేదని అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న 21 బ్రాంచీలలో యూరియా ఉందని, రానున్న నెల రోజుల్లో 40 బ్రాంచిలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో యూరియా ఎంత కావాలంటే అంత ఉందని, ఏలూరు జిల్లాలో మాత్రం 12:30 టన్నులు ఇస్తున్నారని ఆర్ జెడి ఆధ్వర్యాన ఎఒ సమక్షంలో అందిస్తున్నామని తెలిపారు.

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు

ప్రతి 1200 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించిన కలెక్టర్ నాగరాణి




బారులు తీరిన ఓటర్లు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ప్రతి 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ నాగరాణి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనంగా ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున యలమంచిలి మండలం కాజ పడమరలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు అర్ధరాత్రి వరకు క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. ఈ కేంద్రం పరిధిలో 1,423 మంది ఓటర్లు ఉండటమే దీనికి కారణం. ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా సర్దుబాటు చేస్తోంది. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది. దీనికోసం జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. జిల్లాలో ఏడు శాసనసభా నియోజకవర్గాల్లో మొత్తం 1,461 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 500 నుంచి 1500 మంది వరకూ ఓటర్లు ఉన్నారు. 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు ప్రతి నియోజకవర్గంలో సగటున 30 వరకు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో అధికారులు ఇంటింటా పరిశీలించి ఓటర్ల సంఖ్యను బట్టి కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు ఓటు వేసేందుకు నాలుగైదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులనూ తొలగించేందుకు ఒక కేంద్రంలో ఓటర్ల గరిష్ట సంఖ్యను 1300కు పరిమితం చేసేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇబ్బందులున్న కేంద్రాలను విభజించి ఆవాసాల సమీపాన కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో కొన్ని కేంద్రాలు పశువుల ఆసుపత్రులు, పంచాయతీ కార్యాలయాలు, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో సాగుతున్నాయి. వీటిని మార్పు చేయాల్సి ఉంది. ఈ అంశంపై ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగరాణి సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఇంటింటా పరిశీలన చేపట్టి ఓటర్ల వివరాలు సేకరించారు. వాటి ఆధారంగా పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. అవసరమైన చోట అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణలో తప్పొప్పులకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ఫారం-6, 7, 8 క్లెయిమ్‌లను పరిష్కరించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడంతోపాటు, ఓటు హక్కు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని నాగరాణి కోరారు.

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు




ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న నాగరాణి, సుజాత, రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎఎస్‌ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ, పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రతిఒక్కరూ తమ గురువులను సత్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతి, దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సినిమాల్లో ఉపాధ్యాయులను వ్యంగ్యంగా, తప్పుగా చిత్రీకరించొద్దని కోరారు. విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రపంచస్థాయిలో ఉపాధ్యాయ వృత్తి ఒక్కటే ఉన్నత గౌరవం పొందేదిగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు మూల స్తంభం వంటివారని, విద్యార్థికి జ్ఞానాన్ని అందించి సంఘంలో ఒక గౌరవనీయ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైందన్నారు. తల్లిని మొదటి గురువు అంటామని, తర్వాత స్థానం గురువుదే అన్నారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ మంచి సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చి ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే గురువు పాత్ర చాలా అమోఘమైందన్నారు. విద్యార్థులను ప్రభావితం చేసి ఉన్నతస్థాయికి తీసుకురాగలిగిన శక్తి ఉపాధ్యాయుల్లోనే ఉందన్నారు. ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఒక తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయ వేత్తగా పేరు ప్రఖ్యాతలు గడించారన్నారు. రాష్ట్ర మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత మాట్లాడుతూ ఉపాధ్యాయునికి, విద్యార్థికి మధ్య సంబంధం విడదీయరానిదన్నారు. డిఇఒ ఇ.నారాయణ మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి విద్యాశాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. తొలుత బార్డోలి పాఠశాల, పిఎస్ఎంఎం బాలికల ఉన్నత పాఠశాల, రూట్స్ పాఠశాల, ఎఆర్‌కెఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పూలమాల వేసి, శాలువా కప్పి, మెమెంటో, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. సమావేశంలో ఎపి మత్స్యకార సంక్షేమ, ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లి పెద్దిరాజు, ఎపి ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పద్మనాధుని మురళీమోహన్, సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కె.నాగేశ్వరరావు, కోఆపరేటివ్ ఛైర్మన్ నాగరాజు, సమగ్ర శిక్ష ఎపిసి పివై.శ్యాంసుందర్, సహాయ సంచాలకులు సత్యనారాయణ, మధ్యాహ్న భోజనం కోఆర్డినేటర్ కృష్ణారావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, ఉత్తమ ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి



పొలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ఉండి

ఎరువుల దుకాణదారులు ఎరువులు, యూరియా అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం యండగండిలో ఆయన ఇ-పంట నమోదు ప్రక్రియకు సంబంధించి క్షేత్ర పరిశీలన చేశారు. నమోదు ఎలా చేస్తున్నదీ వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. యండగండి గ్రామానికి సంబంధించి 1300 ఎకరాలకుగాను 1050 ఎకరాలు ఇ-పంట నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన 250 ఎకరాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జెసి రైతులతో మాట్లాడుతూ యూరియా ఎలా అందుతుందని ప్రశ్నించారు. యూరియా సొసైటీల ద్వారా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జెసి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాసు, సిబ్బంది కరణం పరంజ్యోతి, ఊర్మిళ, శ్రీనివాసరాజు, విఆర్ఒ గణపతి, హరిబాబు తదితర రైతులు పాల్గొన్నారు.

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల సేవలు రాష్ట్రంలోనే మేటి

కలెక్టర్ నాగరాణికి సిఎస్ అభినందనలు



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల సేవలు రాష్ట్రంలోనే మేటిగా నిలిచాయి. రాష్ట్రంలోని పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల్లో అందుతున్న సేవలపై ఐవిఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయ ఫలితాల్లో ఇది స్పష్టమైంది. పశ్చిమగోదావరి జిల్లా వైద్య సేవల్లో 73.4 శాతం నమోదు చేసుకుని మొదటి స్థానంలో నిలిచింది. తర్వాత రెండు, మూడు స్థానాల్లో కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలు నిలిచాయి. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేసిన జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ నాగరాణి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వైద్య ఆరోగ్యశాఖలో వైద్యులు, సిబ్బంది పనితీరును గాడిన పెట్టేందుకు ఎన్నో సమీక్షలు, క్షేత్రస్థాయి ఆకస్మిక తనిఖీలు సాగించారు. ఇవి పేదలకు లాభం చేకూర్చడంతోపాటు, వైద్య ఆరోగ్య శాఖ ప్రతిష్టను పెంచాయి. తణుకు జిల్లా ఆస్పత్రి మౌలిక వసతుల అభివృద్ధితోపాటు, సొంత బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు కృషి చేశారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకొని తల్లిపాలు లేని తల్లుల పిల్లలకు తల్లిపాలను అందుబాటులో తీసుకొచ్చారు. జిల్లాలోని తలసేమియా రోగులకు, పేదలకు నిరంతరాయంగా రక్తం అందుబాటులో ఉండేలా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు తోడ్పాటునిచ్చారు. ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ రోగులకు డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిచ్చారు.

ఇసుక మాఫియాపై మండలిలో చర్చించాలని కవురుకు వినతి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో అక్రమంగా సాగుతున్న ఇసుక దందా, మాఫియాపై శాసనమండలిలో చర్చించాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసినట్లు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు, వైసిపి సీనియర్ నేత సుంకర సీతారాం తెలిపారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ సందిస్తూ ప్రశ్నోత్తరాల్లో ఇసుక మాఫియాపై మండలిలో ప్రశ్నిస్తానని తెలిపారన్నారు. పేదలకు ఉచితంగా అందించాల్సిన ఇసుకను అక్రమంగా తరలించి అనేక గ్రామాల్లో గుట్టలు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. సంబంధీకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీతారాం కోరారు.

ఆర్‌ఎస్ జీవితం ఆదర్శనీయం

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం - వాడవాడలా ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభలు



ఉండి: నివాళులర్పిస్తున్న జెఎన్‌వి.గోపాలన్, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

మాజీ ఎంఎల్ఎ, సిపిఎం సీనియర్ నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) జీవితం కార్మికవర్గానికి, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆదర్శనీయమని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆర్‌ఎస్ ప్రథమవర్ధంతి సభ సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ చిత్రపటానికి మంతెన సీతారాం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్ జీవితం నేటి యువతకు ఆదర్శంగా ఉండాలన్నారు. జిల్లాలో పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణంలో ప్రేరేప మృత్యుంజయుడు, ఎస్ఆర్ దాట్ల, ఉద్దరాజు రామం, అల్లూరి సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, అనసూయ, దిగుపాటి సాల్మన్‌రాజుతోపాటు ముఖ్యపాత్ర పోషించారన్నారు. చించినాడ గ్రామ సర్పంచిగా, నరసాపురం ఎంఎల్ఎగా ప్రజలకు అనేక సేవలందించారని తెలిపారు. ఆర్‌ఎస్ లాంటి పెద్దదిక్కు లేని లోటు జిల్లాలోని సిపిఎంకు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకూ పోరాటం చేసినప్పుడే ఆర్‌ఎస్‌కు ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.నాగు, కె.వెంకటేశ్వరరావు, కలిపిండి సత్యనారాయణ, బొక్కా సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, బొక్కా శాంతకుమారి, సంసేను, కురిటి సోమేశ్వరరావు, రత్నకుమారి, కార్మికులు పాల్గొన్నారు.

ఉండి: మాజీ ఎంఎల్ఎ, సిపిఎం సీనియర్ నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) స్ఫూర్తితో యువత ఉద్యమించాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. శుక్రవారం సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఆర్‌ఎస్ ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుని ఎర్రజెండా చేపట్టి కమ్యూనిస్టుగా మారారని, నాటి నుంచి తుదిశ్వాస విడిచేవరకూ నిరుపేదలకు న్యాయం చేసేందుకు పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. యలమంచిలి మండలం చించినాడలో 60 సంవత్సరాలపాటు ఎర్రజెండాకు చెందిన వారే పంచాయతీ సర్పంచులుగా, 70 సంవత్సరాలపాటు సొసైటీ ఛైర్మన్లుగా ఎన్నిక కావడంలో ఆర్‌ఎస్ ప్రముఖపాత్ర పోషించారన్నారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా చించినాడను అభివృద్ధి చేసి ఉత్తమ గ్రామంగా నిలిపారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన ఆర్‌ఎస్ చిరస్మరణీయులన్నారు. మండల కార్యదర్శి చీర్ల శేషు మాట్లాడుతూ గతంలో చెరుకువాడలో ఎరువుల దుకాణదారులు యూరియా అక్రమ కొరత సృష్టించినప్పుడు రైతులను సమీకరించి ఆర్‌ఎస్ సాగించిన ఆందోళన మరువలేనిదని, దుకాణదారులు రైతులకు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. సిపిఎం నాయకులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడగా కొట్టాడ వెంకటేశ్వరరావు, పెల్లూరి సుబ్రహ్మణ్యం, చీర్ల శ్రీనివాస్, వంజరపు సూర్యనారాయణ, మజ్జి నాగేశ్వరరావు, మోపిదేవి రాము, కంది గణపతి, సోడదాసి రాజేష్, కట్టా రవి పాల్గొన్నారు.

పాలకొల్లు: ఆదర్శ కమ్యూనిస్టు, కార్మికోద్యమ నేత ఆర్.సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) ఆశయాలు ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఘనమైన నివాళులు అని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. శుక్రవారం ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఆర్‌ఎస్ ప్రముఖులన్నారు. సమాజంలో దోపిడీ ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలు ఉంటాయన్నారు. చించినాడ వర్గపోరుకు నాయకత్వం వహించి చనిపోయే వరకు పార్టీ పంచాయతీగా కాపాడగలిగారన్నారు. కార్మిక, రైతు, ప్రజానాయకునిగా జిల్లాలో అందరి మన్ననలు పొందారన్నారు. ఆర్‌ఎస్ లేని లోటు ఉద్యమానికి తీరని లోటని సీనియర్ నేత పెచ్చెట్టి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, నేతలు చల్లా సోమేశ్వరరావు, టి.గంగరాజు, వై.అజయ్‌కుమార్, యాకల రాము, డి.అజయ్ మాట్లాడగా, డి.రోజామణి, జె.లక్ష్మి, టి.శ్రీనివాస్, ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఎర్రజెండా నుంచి పుట్టుకొచ్చిన ఎర్ర సూరీడు ఆర్‌ఎస్ అని సిపిఎం పట్టణ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభ పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆర్‌ఎస్ చిత్ర పటానికి సీనియర్ నేత సత్తి కోదండరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ, జవ్వాది శ్రీను మాట్లాడారు. కార్యక్రమంలో కర్రి సాయి శ్రీనివాస్‌రెడ్డి, చిటికిన రాము,అడపా లోవ,నరమాల కష్ణ,యాసరపు ఎర్రి నాయుడు, వడిసెల శ్రీను,యడ్ల శ్రీను,పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లులో..

తాడేపల్లిగూడెం రూరల్: ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం సిపిఎం జగన్నాథపురం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కండెల్లి సోమరాజు మాట్లాడగా, పీల గాదినాయుడు, గజ్జరపు వెంకటేశ్వరరావు, పీల కోటేశ్వరరావు, కండెల్లి రమేష్‌బాబు, పీల అప్పాయమ్మ పాల్గొన్నారు.



ఉల్లిపాయల మార్కెట్‌లో..

గణపవరం: ఆర్‌ఎస్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సిపిఎం మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి అన్నారు. ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభ కేశవరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.పెంటారావు, చిన్నం చిన నాగేశ్వరరావు, గుబ్బల వీర్రాజు, బొక్కా అంజి, కేతా శ్రీను, శ్రీలక్ష్మి, కట్టా సత్యవతి, వి.గంగారత్నం, సిహెచ్.పార్వతి, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నరసాపురంలో..

ఆచంట: ఆర్‌ఎస్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. ఆర్‌ఎస్ వర్ధంతి సభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు, బండి రంగారావు, నెక్కంటి కృష్ణమూర్తి, మన్నే బ్రహ్మయ్య, సానబోయిన సత్తిపండు, కేతా నాగాంజనేయులు పాల్గొన్నారు.

పెంటపాడు: ఆర్‌ఎస్ వర్ధంతి సభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ సిరపరుపు రంగారావు, నేతలు చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడగా అల్లు సుబ్బారావు, కరక వెంకట్రావు, సిరపు గణేష్, బేతా అప్పారావు, సలమూరి సత్యనారాయణ, గోర్లు రమేష్, సిరప్ మహేష్, గంటా కోటి, బర్ల బాలాజీ, దౌర్లు సీతయ్య, వెన్నెల చిన్న శ్రీను, పెనగంటి దుర్గా పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్లో ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ ఆఫీస్ వద్ద ఆర్‌ఎస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం తన తుది శ్వాస విడిచే వరకు పని చేశారని బాబూరావు కొనియాడారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఇటుకలగుంటలో ఆర్‌ఎస్ వర్ధంతి నిర్వహించారు. మండల కన్వీనర్ పాలపురి సత్యనారాయణ మాట్లాడగా నేతలు సోమరాజు, పాలుపూరి సత్యవతి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పాలపూరి పుష్ప, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.


నరసాపురం: ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. నరసాపురం ఎంఎల్ఎగా ఈ నియోజకవర్గానికి అనేక సేవలందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచిలి నీలకంఠం, పొన్నాడ మల్లేష్, కొన్నాను అప్పలనాయుడు, సందక దుర్గారావు, జగన్ సురేష్, జి.జ్యోతి ఉమ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: ఆర్‌ఎస్‌కు ఘనంగా నివాళులర్పించారు. బ్రాహ్మణచెరువు చిన్న వంతెన వద్ద సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఆకుల హరేరాం, కె.సుబ్బరాజు, టి.ఆంజనేయులు, కార్మికులు, ఆర్‌ఎస్ అభిమానులు పాల్గొన్నారు.

ఆకివీడు: జిల్లాలో ప్రజా ఉద్యమాల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు ఆర్‌ఎస్ అని పలువురు కొనియాడారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు, నేత డోకల లక్ష్మి ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడగా నేతలు పెంకి అప్పారావు, బివి వర్మ, ఎస్‌కె.వలీ, బి.కళ్యాణి, డోకల రవితేజ, బంక రాజు, బొక్కా సుబ్బారావు, బి.బలరాం, ఆర్‌జి.సతీష్, ఎస్.రంగమ్మ, ఎం.శ్రీను, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల కోసం పరితపించిన ఆర్‌ఎస్ ధన్యజీవి

సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు



యలమంచిలి: ఆర్‌ఎస్ స్వగ్రామం చించినాడలో..

ప్రజాశక్తి - యలమంచిలి

భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేద ప్రజల అభ్యున్నతి కోసం పరితపించిన ఆర్‌ఎస్ ధన్యజీవి అని సిపిఎం సీనియర్ నేత, చించినాడ మాజీ సర్పంచి, సొసైటీ మాజీ అధ్యక్షులు కేతా సూర్యారావు అన్నారు. చించినాడ అమరవీరుల స్మారక భవనంలో ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆర్‌ఎస్ చిత్రపటానికి రైతుసంఘం నాయకులు రుద్రరాజు చినవర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించారు. సూర్యారావు మాట్లాడుతూ ఆర్‌ఎస్ విద్యార్థి దశలోనే పేదల కడు పేదరికాన్ని, శ్రమ దోపిడీకి గురవుతున్న ఘటనలు చూసి చలించిపోయారన్నారు. పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే ఒక్క కమ్యూనిజంతోనే సాధ్యమని ఆ దిశగా పయనం సాగించారన్నారు. అనేక పోరాటాలు నిర్వహించిన యోధుడని, చించినాడ సర్పంచిగా, సొసైటీ అధ్యక్షునిగా, నర్సాపురం ఎంఎల్ఎగా పని చేసి పేదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆర్‌ఎస్ వర్ధంతి సభ ఈ నెల 8న చించినాడ అమరవీరుల స్తూపం వద్ద పెద్దఎత్తున నిర్వహించనున్నామని, దీనికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, బాతిరెడ్డి సుగుణ, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, కలగంపూడి మాజీ సర్పంచి, సిపిఎం నేత పొత్తూరి జ్యోతి, పొత్తూరి నరసింహారాజు, ముస్కుడి జయశ్రీ, శెట్టిమి నాగమణి, పల్లేరు వెంకటస్వామి, కోరం వెంకటేశ్వరరావు, మురాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు,

ఆయాలు, స్వీపర్లకు బకాయి వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ స్కూళ్లలో పని చేస్తున్న ఆయాలు, స్వీపర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, ఆయాలతో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం ఉమామహేశ్వరి, సిహెచ్.ధనలక్ష్మి అధ్యక్షులుగా ఉన్నారు. త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని హైస్కూల్, ఎలిమెంటరీ స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న పది నెలల జీతాన్ని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుమలి నాగమణి, జి.లక్ష్మి జ్యోతి, కోయల సూర్యవతి, పున్నమి ఉమాదేవి, కొల్లాటి దేవి, అడ్డంకి పద్మ, షేక్ సాలియా బేగం, ఉయ్యూరు సూర్యకాంతం పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నాలుగో సచివాలయం పరిధిలోని స్థానికులకు శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా మలేరియా పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టడం వల్ల డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం కె.కెజీయా, ఎంఎస్ యోహాన్, ఆశాలు, సిహెచ్.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

10న బధిర పాఠశాల పూర్వ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 10వ తేదీన జరిగే బధిరుల పాఠశాల పూర్వ విద్యార్థుల 40వ వార్షికోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను బిల్డర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్ ఆవిష్కరించారు. శుక్రవారం భీమవరం వెంకట్రామ థియేటర్ కాంప్లెక్స్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర సంతరించుకున్న టిటిడి వారి బధిర పాఠశాల విద్యార్థులు విద్య, విద్యేతర అంశాల్లో ముందుంటున్నారని తెలిపారు. టిటిడి వారు బధిరుల భవిష్యత్తు బంగారు బాట వేయడం గొప్ప విశేషమన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి, ప్రధాన కార్యదర్శి సిహెచ్.తాతారావు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన డిఎన్ఆర్ రామక్రిష్ణ సభ భవనంలో ఉదయం 10 గంటల నుంచి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని, 400 మంది పూర్వ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి.ఎం.కె.రాజు, టి.రామ, జి.రవికుమార్ రాజు, కొండ రాజు, శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బిసి కళాశాల బాలుర వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు మంజూరు చేయాలని విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వాలు పరిష్కార మార్గం చూపడం లేదని విమర్శించారు. సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కార మార్గాలు చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వి.అనిల్, ఎం.చందు, కె.హర్ష, బి.రాజు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధురాలి కడుపులో భారీ గడ్డ

తొలిగించిన సౌమ్య ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పోడూరు మండలం వద్దిపర్రుకు చెందిన 85 ఏళ్ల వృద్ధురాలు కడియం సీతా మహాలక్ష్మి కడుపు నొప్పి, ఉబ్బరంతో పాలకొల్లులోని సౌమ్య హాస్పిటల్‌కు గురువారం రాత్రి వచ్చారు. వైద్యులు ఆమెకు స్కాన్ చేయించగా కడుపులో భారీ గడ్డ ఉందని తేలింది. ఆమెకు వెంటనే ఆపరేషన్ చేసి విజయవంతంగా గడ్డను బయటకు తీసి కాపాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చెందిన జనరల్, లేప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ లంకలపల్లి గోకుల్ కుమార్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ రాజశేఖర్ సారథ్యంలో వైద్య బృందాన్ని పలువురు ప్రముఖులు, వైద్యులు అభినందించారు.

'సంచార జాతులకు కూటమి చేసిందేమిటి?

ప్రజాశక్తి - కాళ్ల

సంచార జాతులకు కూటమి చేసిందేమిటో చెప్పాలని ఎంబిసి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సంచార జాతుల సంఘం వ్యవస్థాపకులు పెండ్ర వీరన్న డిమాండ్ చేశారు. పెద అమిరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బూటకపు హామీలు ఇచ్చిందన్నారు. బిజెపి అధ్యక్షులు మాధవ్ సంచార జాతులకు చేసిన మేలేంటో చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వం మాత్రమే అన్ని సంచార జాతుల సంక్షేమం కోసమూ కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంచార జాతుల అధ్యక్షులు చుండూరి ముసలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత వీర్రాజు, జిల్లా కార్యదర్శి చుండూరి నాగరాజు, జిల్లా యువజన కమిటీ సభ్యులు కవాలి భవాని, సాలా అశోక్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాటం చేయక తప్పదని ఎస్‌జిపిఎ జిల్లా అధ్యక్షులు బి.హరికుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మార్టేరు రోటరీ భవనంలో జరిగిన పెన్షనర్ల సంఘ మండల నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి జయంతి నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి, జిల్లా అడ్వైజరీ వికె.రామారావు ప్రకటించి, ప్రమాణం చేయించారు. గౌరవాధ్యక్షులుగా తామాడ సత్యనారాయణ, అధ్యక్షులుగా కొత్త సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా కోనాల నర్సిరెడ్డి, ఆర్.గణపతి, కె.లక్ష్మినారాయణ, కార్యదర్శిగా పిఎన్‌వి.ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.నందన్‌కుమార్, పి.సువర్ణగౌరి, వి.భారతి, కోశాధికారిగా చిర్ల సూర్యనారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పడాల కేశవరెడ్డి, 10 మంది ఇసి సభ్యులుగా ఎన్నికయ్యారు.

7న చంద్రగ్రహణం సందర్భంగా వెంకన్న ఆలయం మూసివేత

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈ నెల 7వ తేదీ ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 11 నుంచి 8వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటల వరకూ ఆలయం మూసి వేస్తామని తెలిపారు. యాత్రికులు గమనించాలన్నారు.

9న యూరియా సమస్యను పరిష్కరించాలని ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల తొమ్మిదో తేదీ ఏలూరు ఫైర్‌స్టేషన్ దగ్గర నుంచి శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాస్ రావు (వాసుబాబు) చెప్పారు శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు నియేజకవర్గస్థాయి వైసిపి కార్యకర్తల సమావేశం జరిగింది. వాసుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు కావాల్సిన యూరియా అందించలేకపోతోందని విమర్శించారు. సమస్య పరిష్కారానికి పార్ఆద్వర్యంలోర్యాలిచేస్తు ఆర్ డిఓకి వినతిపత్రం అందచేస్తామని చెప్పారు ఈసమావేశంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మడివి రాజు అకాల మృతి దిగ్భ్రాంతికరం

బుట్టాయిగూడెం: సిపిఎం జైనవారిగూడెం గ్రామ నాయకులు మడివి రాజు అకాల మరణానికి సిపిఎం మండల కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. శుక్రవారం జైనవారిగూడెం గ్రామంలో జరిగిన అంతిమయాత్రలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, మండల నాయకులు పోలోజు నాగేశ్వరావు, తామ ముత్యాలమ్మ, తాటి రాంబాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు మడివి రాజన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడివి రాజు ప్రజానాట్యం మండలిలో చురుకైన పాత్ర నిర్వహించారని, ఎక్కడ కార్యక్రమం ఉన్న డబ్బుని చేతి పట్టుకొని ఎన్ని రోజులైనా వుండి కార్యక్రమం విజయవంతం చేసేవారన్నారు.జైనవారిగూడెంలోనే అనేకమంది భూ పోరాటానికి ద్రోహం చేసినప్పటికీ మడివి రాజు మాత్రం నిజాయితీగా గిరిజన పక్షాన నిలబడి భూ స్వాములతో రాజీ పడకుండా పోరాటం నిర్వహించారని తెలిపారు. మడివి రాజు కుటుంబానికి సిపిఎం జిల్లా కమిటీ తరపున సంతాపం, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం సీనియర్ నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మడివి రాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు


పెనుమంట్రలో..


వీరవాసరంలో..


తణుకులో..

పెనుమంట్ర : గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు ఉపాధ్యాయులు శుక్రవారం భీమవరంలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నుండి అందుకున్నారు. ఎస్‌జిటి కేటగిరిలో ఆలమూరు మండల పరిషత్ మోడల్ స్కూల్ నుంచి యాళ్ల శోభారాణి, మాముడూరు మండల పరిషత్ మోడల్ స్కూల్ నుంచి డిఎన్‌వి.సత్యనారాయణ, డి.నరసింహారావు, పొలమూరు మండల పరిషత్ మోడల్ స్కూల్ నుంచి విఎస్ఎల్.హయాగ్రీవాచార్యులు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో సోమరాజు ఇల్లింద్రపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ బిఎస్.ఉపాధ్యాయిని కె.ఉమామహేశ్వరి అవార్డ్స్ అందుకున్నారు. ఈ ఐదుగురు ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులతో పాటు తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు తదితరులు అభినందించారు.

గణపవరం డిగ్రీ కాలేజీలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ మూర్తి జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ రాధాకృష్ణ సేవలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు అని మండల విద్యాశాఖ అధికారి బొక్కా వినాయకుడు తెలిపారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా చిలుకూరు మండల పరిషత్ స్పెషల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, పెదపుల్లేరు శివారు మేడవరం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు సాల్మన్ రాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందినట్లు ఎంఇఒ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం అవార్డు పొందిన ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సాల్మన్‌రాజు మాట్లాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎపికైన వెంకటేశ్వరరావు, సాల్మన్ రాజుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు అభినందించారు.

వీరవాసరం : వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్, వనితా క్లబ్, వీరవాసరం కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సిబిఐ ఎఎస్‌పి బండి పెద్దిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వీరవాసరం ఎంఆర్‌కె హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, కె.శ్రీనివాస్, వీరవల్లి భారతీ, సతీష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరించి మాట్లాడారు. పాలా ఆంజనేయులు, గుండా రామకృష్ణ, కెవిఎల్, కుంచే వేణు, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : మానవత ఆధ్వర్యాన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్‌వికెపి వైఎస్ రాజు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, తేతల సుబ్బరాయుడు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుబ్బరాయుడు రెడ్డి, మానవత అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో మొత్తం 60 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. నలిమిల్లి విజయరాజు, కళాశాల ప్రిన్సిపల్ వివి.అప్పారావు, షేక్ మస్తాన్, కర్రి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

తణుకు : విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఎంఎల్ఎ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను చిత్రహింసలకు గురి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు జమ అయ్యేవిధంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ సేవలందిస్తున్న 32 మంది ఉపాధ్యాయులను ఎంఎల్ఎ సత్కరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసాపురం : శ్రీ సూర్య జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని టీచర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, గౌరవ అతిథిగా ఆర్‌డిఒ దాసి రాజు, విశిష్ట అతిథిగా గజల్ గాంధీ పాల్గొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులను, గత విద్యా సంవత్సరంలో అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఎల్ఎ, ఆర్‌డిఒ సమక్షంలో అభినందించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉపాధ్యాయులు జాతి నిర్మాతలన్నారు. అనంతరం శ్రీ సూర్య యాజమాన్యాన్ని మెచ్చుకున్నారు. ఆర్‌డిఒ దాసి రాజు, ప్రముఖ గజల్ రచయిత గజల్ గాంధీ మాట్లాడారు. శ్రీ సూర్య విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, సీనియర్ అధ్యాపకులు ఎఆర్ఎస్.కుమార్, అకడమిక్ అడ్వైజర్ బి.రామచంద్రారెడ్డి, ర్ ఫాజిల్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గణపవరం : సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గణపవరంలోని 12 అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్స్ డే నిర్వహించారు ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సర్వేపల్లి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎక్సైజ్ శాఖా కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వదేశీ, విదేశీ మద్యం కార్పొరేట్ కంపెనీల లాభాలు, ప్రభుత్వ పెద్దల ప్రయోజనాల కోసం మద్యంతో గ్రామాలను ముంచేస్తూ గీత కార్మికుల పొట్టలు కొడుతుంటే చూస్తూ ఊరుకోబోమని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి హెచ్చరించారు. పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో వందల మంది గీత కార్మికులు భీమవరం ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. తొలుత పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు, రాము స్వీట్స్ మీదుగా ఎక్సైజ్ శాఖా కార్యాలయానికి చేరుకుని 'అక్రమ బెల్టు షాపులు రద్దు చేయాలని, ఉపాధి కోల్పోయిన గీత కుటుంబాలను ఆదుకోవాలని' పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభకు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు అధ్యక్షత వహించారు. అనంతరం ఎక్సైజ్ సిఐ బి.బలరామరాజుకు వినతిపత్రం అందించారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ అక్రమ బెల్ట్ షాపులపై ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రులు ఇచ్చిన మాట ఎందుకు అమలు చేయడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి పాలనలో గీత కార్మికులు బతకలేని పరిస్థితి కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ పెద్దల ప్రజాయోజనాల కోసం, బడా కంపెనీల, సిండికేట్ల లాభాల కోసం లక్షలాది కుటుంబాలు చిన్న, భిన్నం చేస్తారా అని ప్రశ్నించారు. గీత కార్మికులను ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. గీత వృత్తి రక్షణ, ఉపాధి, సంక్షేమం, వృత్తి ఆధునీకరణ, సామాజిక భద్రత ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నించారు. తక్షణం బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. కల్లును ప్రోత్సహించాలన్నారు. వృత్తిలో చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొక్కా చంటి, మామిడిశెట్టి నాగభూషణం, సహాయ కార్యదర్శులు దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, కాగిత రాధాకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, తుంగా సాయిబాబు, ఇర్రింకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


వినతి అందిస్తున్న జుత్తిగ నరసింహామూర్తి, గీత కార్మికులు

విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

విఒఎలకు కనీస వేతనం రూ. 26 వేలు అందించి ప్రతి ఒక్కరికి రూ. 15 లక్షలు జీవిత బీమా సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో వివోఎల జిల్లా విస్తృత సమావేశం నాయకురాలు నాగిడి గోవిందమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ. డ్వాక్రా మహిళలు గ్రూపులు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి రెవెన్యూ తెస్తున్న వివోఏలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అనేక ఏళ్ల గా పనిచేస్తున్న వివోఏలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివోఎలను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని కోరారు.వివిధ రకాల యాప్లతో పని భారం పెంచుతున్నారని పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు పెరుగుతున్న ధరలు మరోపక్క ఇంటి అద్దెలు కరెంట్ చార్జీలు భారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివోఎల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి వారి సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో దశలవారు ఆందోళన చేపడుతారని హెచ్చరించారు. ఈ నెల 9న వివోఎల జిల్లా మహాసభ భీమవరంలో నిర్వహించనున్నట్లు ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు నాయకుడి గోవిందమ్మ ఎస్ జయ షేక్ అభిబ నల్లమట్టి జ్యోతి ఎస్ మంగమణి ఎం లక్ష్మీనరసమ్మ బీ రుతమ్మ పాల్గొన్నారు



నినదిస్తున్న విఒఎలు

ప్రకాష్ నగర్‌లో సమస్యలు పరిష్కరించాని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి -భీమవరం

29 వ వార్డు ప్రకాష్ నగర్ లో ఉన్న డ్రైనేజీ ,మంచినీరు , వ్యక్తిగత మరుగుదొడ్లు సమస్య పరిష్కరించాలని సిపిఎం పట్టణ ఎం వైకుంఠ రావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాష్ నగర్ లో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా వైకుంఠ రావు మాట్లాడుతూ మైదాన గిరిజనులు సమస్య పరిష్కరించాలని అనేకసార్లు కలెక్టరేట్ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలు చేసి వినతి పత్రాలు అందజేసిన సమస్య పరిష్కారం కాలేదని మండిపడ్డారు. వర్షాలు కారణంగా వాడకం నీరు ,వర్షపు నీరు , వెళ్లే మార్గం లేక రోడ్ల మీదకు వచ్చి దోమలతో పిల్లలు కు మలేరియా టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న అదిగో ఇదిగో అని కాలయాపనచేస్తున్నారని ఆరోపించారు. మైదానం గిరిజనులు సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు దుర్గారావు , సంజీవరావు , మరియమ్మ , యోహాను , దుర్గ, మైదానం గిరిజనులు పాల్గొన్నారు



పత్రికా రంగంలో ప్రజాశక్తి ప్రత్యేకం

45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజా సమస్య లను ప్రతిబింబిస్తూ అక్షర యజ్ఞం చేస్తున్న ప్రజాశక్తికి పత్రికా రంగంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని ముదినేపల్లి స్పామ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్య నారాయణ అన్నారు. శుక్రవారం ముదినేపల్లిలో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను డాక్టర్ మనోజ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ పత్రికా రంగంలో ప్రజాశక్తికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విభిన్న కథనాలతో ప్రజాహితం కోసం ప్రజల పక్షాన నిలుస్తూ వార్తలను రాయటం హర్షణీయమన్నారు. ముదినేపల్లి మండలం నుంచి ఎనిమిది పేజీలతో ప్రత్యేక సంచికను వివిధ రంగులతో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ జిల్లా ఇన్‌ఛార్జి యార్లగడ్డ సీతారాం, యాడ్స్ డివిజన్ ఇన్‌ఛార్జి ఎం.సాంబమూర్తి, ప్రధానోపాధ్యాయుడు డి.వి.నరసయ్య, విలేకరి ఎస్.సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన ట్రస్టుబోర్డు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-నరసాపురం

నరసాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాల స్వామి వారి దేవస్థానంలో (పెళ్లిళ్ల గుడి) శుక్రవారంనూతన ట్రస్ట్ బోర్డ్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఈవో కొండవేటి రామచంద్ర రావు నూతన ట్రస్ట్ బోర్డ్ సభ్యులచే ప్రమాణ స్వీకారాన్ని చేయించారు.ఈ సందర్భంగా ఎన్నిక కాబడిన ట్రస్ట్ బోర్డ్ సభ్యులందరూ కలిసి శ్రీ రామవరపు శ్రీరామ్ ని ఏకగ్రీవంగా నూతన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా ఎన్నుకున్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అడ్డాల దుర్గాభవాని, కొమ్ము వెంకటరావు , జక్కం దుర్గా నాగేశ్వరరావు, సింగారపు సుబ్బు , జట్ల నాగేశ్వరరావు , బస్వాని నాగమణి , కరినేని ఉమామహేశ్వరి, సంసాని పద్మావతి ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకార అనంతరం సభ్యులు అష్ట బుధవార ప్రదక్షణ దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మాట్లాడుతూ 8 బుధవారాలు, స్వామివారికి ప్రతివారం 8 ప్రదక్షిణాలు చేసి, ఆఖరి వారం స్వామివారికి పూజ చేయించుకుంటే భక్తుల కోరికలు నెరవేరతాయని కావున ప్రతి ఒక్కరూ ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆలయాన్ని మరింత అభివద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్తామని ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మరియు ఆలయ ఈవో తెలియజేశారు. ఆలయ అర్చకులు అంగర శ్రీధర్, ఎక్స్ అఫీషియల్ మెంబర్గా ప్రమాణ స్వీకారం చేశారు.

సిపిఎం బంగారుగూడెం శాఖా కార్యదర్శిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యువకుడు, విద్యావంతుడైన అయినపర్తి వెంకటేశ్వర రావును బంగారుగూడెం నూతన కార్యదర్శిగా శుక్రవారం జరిగిన సమావేశంలో సభ్యులంతా కలిసి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బంగారుగూడెం, వీరంపాలెం ఏరియాలో పార్టీ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యఅతిథి మండల నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా గ్రామాల్లో ఇళ్లు ,, ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు పోలుపో పెద్దయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు పోలుపో బాయమ్మ, గుమ్మడి కేశవ, శంఖవరం మహాలక్ష్మి, గుదే పాపమ్మ పాల్గొన్నారు.